# నా భర్తను హత్య చేసానా...?

◆ అనిత వోజ్జల ◆

"ఏమిటి...! నిజమా...?" అంది శరణ్య లోపలికి అడుగు పెడ్తూ.

"ఆ...! నిజమే...! రా..." అంది హిమజ.

"ఇంకా నాకు నమ్మబుద్ధి కావట్లేదే...? నువ్వు నీ భర్తని చంపావంటే...! నీకు ఇంత ధైర్యం ఎలా వచ్చిందే...!" అంది గుండెలపై చేతులు వేసుకొని సోఫాలో కూర్చుంటూ.

"ధైర్యమా... పాడా... తెగింపు...! ఏం చెయ్యను...! రోజు... క్షణక్షణం నన్ను మానసికంగా చంపేస్తుంటే తెగించి ఒక్కటేసారి అతన్ని హత్య చేసాను..."

"హత్యా...!" అంది శరణ్య భయంగా కిటికీ వైపు చూస్తూ.

అపుడు సమయం రాత్రి పన్నెండు గంటలు...

ఊరంతా నిశ్శబ్దంగా నిద్రపోయింది.

అమావాస్య రాత్రేమో.... చిక్కటి చీకటి జుట్టు విరబోసుకున్న దయ్యంలా ఆవరించుకుంది

కిటికీ దఢాలున మూసి... "హత్యా...? హత్యేలా చేశావ్?" భయంగా అడిగింది శరణ్య.

"హత్య చేయడం ఇంత సులభమని నాకు ఇంత వరకు తెలియదు. ఎప్పుడు పేపర్‌లో దొంగతనాలు, హత్యలు చూసి భయపడేదాన్ని.... కాని హత్యచేయడం ఇంత సులభమని ఈ రోజే ప్రాక్టికల్‌గా చేసి తెలుసుకున్నా..." అంది హిమజ.

ఆమె గొంతులో బాధలేదు... దుఃఖం లేదూ... భయం అసలే లేదు... కాని... ఏదో తెలియని నిర్లిప్తత ఉంది.

"ఇలాంటి పనెందుకు చేసావ్...! అంత మంచి భర్తను చంపాల్సిన అవసరం ఏమొచ్చిందే...! పెండ్లి చేసుకున్నాక అడ్జస్ట్ అవ్వక తప్పదూ...! ఏదో తప్పు చేసాడని ఇలా ప్రతి భార్యా తన భర్తను చంపుకుంటూ పోతే ఈ లోకంలో మగాడంటూ మిగలడు తెలుసా...?"

"అది కాదే నన్ను అర్థం చేసుకోవేం"

"ఏంటే నిన్ను అర్థం చేసుకునేది! అర్ధరాత్రి ఫోన్ చేసి... నా భర్తను హత్య చేసాను. నాకేం చెయ్యాలో అర్థం కావట్లేదు వెంటనే రా అన్నావ్...! వచ్చాను...! ఇక్కడికి వచ్చి చూసేవరకూ నువ్వు చేసింది నిజమని నేను నమ్మలేదు... కానీ.. ఈ శవమే నిరూపిస్తుందే నీవు దేవుని వంటి భర్తని హత్యచేసావని..." అంది శరణ్య వెక్కుతూ...

"ఛ...! ఊరుకోవే...!" అంది హిమజ.

"అసలు నువ్వు మనిషివేనా... కట్టుకున్న వాడ్ని హత్యచేసింది కాక... ఇంకా ఏడువొద్దని చెబుతున్నావ్...! ఈ రోజు నీకేమయ్యిందే...? ఆ...! నాకర్థమయ్యింది...! పిచ్చిపట్టినట్లుంది... వుండు... ఎర్రగడ్డకు ఫోన్ చేస్తాను..." అంటూ ఫోన్ పట్టుకోబోయింది.

హిమజ ఆమె చేతుల్లోంచి ఫోన్ లాక్కొని "ఛీ...! ఇడియట్...! అర్ధరాత్రి ఆపదలో వున్నావని ఫోన్ చేసి రమ్మంటే... వచ్చి తీరా... మెంటల్ ఆస్పిటల్‌కు ఫోన్ చేస్తానంటావా...? ఇంకా నయం! పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేస్తాననలేదూ...!" అంది.

"మరిపుడు ఏం చేద్దామే..." అంది శరణ్య భయంగా.

"తెల్లారేలోగా ఈ శవాన్ని మాయం చెయ్యాలి."

చెళ్ళుమని కిటికీలో నుంచి గాలి రివ్వున వీచి. గట్టిగా శరణ్య చెంపను తాకింది. చెళ్ళున చెంప మీద కొట్టినట్లయ్యింది ఆ క్షణం. తరువాత భగభగమంటూ మంట... అరచేత్తో చెంపను రాసుకొని "మనమా...?" అంది శరణ్య టెన్షన్‌గా.

"ఆ మనిద్దరమే... తెల్లారేలోగా జరిగిపోవాలి' అంది హిమజ. ఆమెలో భయంలేదు. కానీ, పని త్వరగా కావాలన్న ఆరాటమే ఎక్కువగా ఉంది.

గడియారం 'ఠంగుమని గంట కొట్టింది.

శరణ్య గుండె గుభేల్ మంది. గట్టిగా స్నేహితురాల్ని పట్టుకుంది.

సమయం ఒకటైంది.

"ధైర్యంగా తోడుంటావని నిన్ను ఫోన్ చేసి పిలిస్తే ఏంటా భయం... చిన్నపిల్లలా...ఆ శవమేమయినా నిన్ను కొరుక్కుతింటుందా...? లేక

●●●


ఇద్దరూ శవాన్ని కారు వెనక సీట్లో పడుకోబెట్టారు.

●●●

ఇంకేమయినా వేస్తుందా...? అంత భయమెందుకులే...'' అంది హిమజ.

ఎంత ప్రయత్నించినా శరణ్యా తనలోని భయాన్ని కంట్రోలు చెయ్యలేకపోతోంది.

భయం భయంగా శవం వైపు చూసింది. ఆ తరువాత మరింత ఆశ్చర్యపోయింది.



అప్పుడే శవం కాలి దగ్గర ఏదో శబ్దం అయ్యింది

కెవ్వుమని కేకేసింది శరణ్యా.

హిమజ పరుగెత్తుకుంటూ వచ్చి స్నేహితురాలి నోరుమూసి ''నీ... సహాయం నా కొద్దే... నువ్వు ఇంటికి వెళ్ళు... నీ అరుపులు... కేకలు... చుట్టు పక్కల వాళ్ళు వింటే అపుడు మరిన్ని ప్రాబ్లమ్స్ ఎదురవుతాయి...! లే..! గెటప్...! మీ ఇంటికెళ్లు...'' అంది హిమజ సీరియస్‌గా.

''తప్పయిపోయిందే సారీ...! నిన్ను ఈ పరిస్థితుల్లో వదిలి నేను వెళ్ళలేను... అయినా... ఇంతగా నేనెందుకు భయపడుతున్నానో నాకే అర్థంగావట్లేదు. ఈ ఊహించని సంఘటనను నా గుండె తట్టుకోలేదే...'' అంటూ గుండెల మీద చెయ్యి వేసుకొని... ''సరే! సరే! ఇపుడు ఈ శవాన్ని ఏం చేద్దాం'' అంది శరణ్యా.

''శ్మశానంలో పాతిపెట్టేద్దాం'' అంది హిమజ

''ఆ! ఆ..! నువ్వు కూడా రానంటే చెప్పు! నేనొక్కదాన్నే వెడతా''

''ఛ...! ఛ...! అవేం మాటలు! ఇక బయలుదేరుదామా'' అంది శరణ్యా నొచ్చుకుంటూ.

''అలాగే...!''

''ఈ శవాన్ని శ్మశానికి ఎలా తీసుకెళ్తామే''

''కారులో''

''మరి మనం''

''అదే కారులో''

''అదెలా సాధ్యం''

''అబ్బా! నీ ప్రశ్నలతో విసిగించకు! కారు డిక్కీలో శవాన్ని పడుకోబెడదాం. కారులో మనిద్దరం కూర్చుందాం! సరేనా అటుపట్టు''.

శవంతో పాటు అదే కారులో వెళ్ళడం శరణ్యాకు అసలు ఇష్టం లేదు అనడం కంటే భయమే ఎక్కువని చెప్పవచ్చు.

కాని వద్దంటే స్నేహితురాలు వినదని ''పోలీసులు ఎవరైనా చూస్తే''అంది ప్రశ్నార్థకంగా.

''ఆ...! వాళ్ళ సంగతి నేను చూసుకుంటాలే'' అంది హిమజ తేలిగ్గా.

ఆమె ధైర్యానికి విస్తుబోతూ ''ఏటు పట్టాలి'' అంది శరణ్యా

**హత్య చేయడం ఇంత సులభమని నాకు ఇంతవరకు తెలియదు.**

"శవం కాళ్ళు దగ్గర పట్టుకో..." అంటూ... శవాన్ని భుజాల దగ్గర పట్టి పైకి లేపింది హిమజ.

భయంగా రెండు కాళ్ళు పట్టుకొని శవాన్ని పైకి లేపింది మనసులో దేవున్ని స్మరిస్తూ...

ఇద్దరూ శవాన్ని కారు వెనుక సీట్లో పడుకో బెట్టారు.

తవ్వడానికి గడ్డపారను డిక్కీలో పెట్టి క్లోజ్ చేసింది హిమజ.

ఆ తరువాత తను డ్రైవింగ్ సీట్లో కూర్చుని "రా!" అంటూ ప్రక్క తలుపులు తెరిచింది హిమజ.

దబ్బున కారులో కూర్చుని దఢాలున డోర్ మూసింది శరణ్య.

కారు మెల్లిగా ఇంటి నుంచి బయటికి వచ్చి రోడ్డు ఎక్కి వేగాన్ని అందుకుంది.

ఎప్పుడో వేగంగా ఓవర్ టేక్ చేస్తూ వెళ్ళే లారీలు తప్ప... రోడ్డంతా ఖాళీగా ఉంది.

కారులో కూర్చున్నప్పటి నుండి వాళ్ళిద్దరి మధ్య మాటలు లేవు

ఇక మౌనాన్ని భరించలేనట్లు "పైకి నెత్తుటి మరకైనా లేకుండా ఎలా చంపావే..." అని అడిగింది శరణ్య ఎగ్జయిటింగ్‌గా.

"ఓ అదా...! ఆర్సెనిక్" అంది హిమజ మామూలుగా.

"అంటే...!" అంది శరణ్య అర్ధం కానట్లు మొహం పెట్టి.

"చాలా ఈజీ...! రోజు అతను పడుకునే ముందు త్రాగుతాడు. మూడో పెగ్‌లో ఆర్సెనిక్ కలుపుతున్నాను. అది వెంటనే ప్రభావం చూపించదు. స్లోపాయిజన్. మెల్ల మెల్లగా మోతాదు పెంచేసరికి నెల రోజుల్లోనే గురుడు టపా కట్టాడు

"అసలు ఎందుకు చంపాల్సొచ్చిందే? అతను అంత పెద్ద తప్పేం చేసాడు?" అని అడిగింది శరణ్య ఆశ్చర్యంగా.

"ఏం చెయ్యనే! ప్రతిదానికి సాధింపులు, వేధింపులు... భలే అనుమానం మనిషి అనుకో. రోజు రోజుకి విసుగొస్తోంది. నేను ఏ పని చేసినా అనుమానమే... పాలవాడితో కూడా తనే పాలు పోయించుకుంటాడు. నన్నసలు బయటకే రానీయడు. రోడ్డుమీద వున్న ప్రతి మగాడు నన్ను రేప్ చేస్తాడన్నట్లు బిహేవ్ చేస్తాడు. ఈ మధ్యయితే నన్ను రోజు ఇంట్లో వుంచి తాళం వేసి ఆఫీసు కెళ్తున్నాడు. ఇంటికి వచ్చిన వాళ్ళు నన్ను పలకరించినా అనుమానమే. ఇంటికి వచ్చినవారు నన్ను చూసి పలకరింపుగా నవ్వితే... ఇక ఆ రోజు రాత్రి నా పని అయిపోయినట్లే... బాగా త్రాగి వచ్చి "వాడితో నీకేం సంబంధమే" అంటూ ఇష్టం వచ్చినట్లు బెల్టుతో కొడతాడు" అంది హిమజ.

అపుడు ఆమె కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి

"అరెరె! ఈ విషయాలన్ని నాకు తెలియవు. ఎప్పుడు చెప్పనేలేదూ!"

"ఏం చెప్పాలి! ఎవరి ప్రాబ్లమ్స్ వారికున్నాయి! నీవు మాత్రం సుఖంగా వున్నావా?"

"అది నిజమే అనుకో...! సైక్రియాటిస్ట్‌కు చూపించకపోయావా?"

"అన్ని అయ్యాయి... ఆ తరువాతే ఇక లాభం లేదని ఈ పని చేసాను".

"మంచిపని చేసావ్... అనుమానంతో భార్య ను వేధించే శాల్తికి ఈ పని జరగాల్సిందే" అంటూ కసిగా వెనక్కు తిరిగి చూసింది శరణ్య.

శవం ఎడమ కనురెప్ప సగం మూసుకొని సగం తెరుచుకొని వున్నట్లు అనిపించింది ఆమెకు.

కెవ్వుమంది శరణ్య భయంతో.

సడన్ బ్రేక్ వేసి కారాపి "ఏమైందే" అని అడిగింది హిమజ.

"ఈ... ఈ... శవం... నన్ను చూసి కన్ను కొట్టిందే" అంది శరణ్య భయంగా.

"నీ మొహం! శవం కన్నుకొట్టడమేంటి? అంతా నీ భ్రమ" అంటూ కసిరింది హిమజ.

పది నిమిషాల్లో శ్మశానం వచ్చింది.

మరో క్రొత్త శవానికి స్వాగతం చెబుతున్నట్లు కుక్కలు దూరం నుండి అరుస్తున్నాయి.

కారుని ఖాళీగా వున్న ప్రదేశంలో ఆపింది హిమజ.

వేగంగా గొయ్యి తవ్వడం ప్రారంభించారు.

గంట తరువాత నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటూ తలెత్తింది శరణ్య.

శ్మశానమంతా నిశ్శబ్దం పేరుకుంది.

అప్పుడప్పుడు ఆకుల గలగలలు తప్ప... ఇంకే శబ్దం లేదు.

ఇద్దరూ కలిసి వెనక సీట్లోంచి శవాన్ని తీసి ఆ గొయ్యిలో పడుకోబెట్టి మట్టితో పూడ్చారు.

"పదవే పోదాం" అంది శరణ్య చేతులు దులుపుకుంటూ.

రిలీఫ్‌గా నిట్టూర్చి... గడ్డపారను డిక్కీలో వేసి డ్రైవింగ్ సీట్లో కూర్చుంది హిమజ.

కారు స్పీడ్‌గా ముందుకు పరుగెత్తుతోంది.

వాళ్ళిద్దరి మధ్య మాటలు లేవు.

నిశ్శబ్దపు తెర వాళ్ళిద్దరి మధ్య దూరాన్ని తగ్గించలేకపోతోంది.

ఆ పది నిమిషాల కాలమే భయంకరమైన పది యుగాల్లా గడిచింది.

కారు ఆగగానే "పీడ విరగడ అయ్యింది" అంటూ దిగి లోపలికి వెళ్ళింది హిమజ.

ఆమెను అనుసరించింది శరణ్య.

తాళం తీసి లోపలికి అడుగు పెట్టగానే "స్నేహితురాళ్ళిద్దరూ ప్రొద్దున్న నాలుగు గంటలకే ఎక్కడికో షికారు కెళ్ళారు" అని అడిగాడు హిమజ భర్త.

ఆ మాటలేవి వాళ్ళ చెవిని తాకలేదు.

తలుపు తెరవగానే తెల్లబట్టలతో... చేతిలో పుస్తకంతో అతను...

"...ఇత... ఇతనెవరూ.... నా భర్తేనా... నా భర్తను నేను హత్యచేసానా...? నా...భ...ర్త...ను. ..హ...త్య...చే...సా...నా...?" తల గిర్రున తిరిగింది హిమజకు.

"చంపి పాతి పెట్టిన భర్త మళ్ళీ ఇంట్లోకి ఎలా వచ్చాడు' అన్న ప్రశ్నకు సమాధానం వారి మెదడుకు తట్టకముందే కెవ్వుమన్న కేక ఇద్దరి గొంతుల నుండి వెలువడింది.

భర్తల వల్ల బాధపడే భార్యల మనసుల్లోని కసికి ఓ ఆకృతి వస్తే ఇలాగే వుంటుందేమో.......